క్లుప్తంగా

గాయత్రీ, విశ్వకర్మ భగవానుల కల్యాణం



మహబూబాబాద్ రూరల్: శ్రీమహాగాయత్రీ అమ్మవారు, విశ్వకర్మ భగవానుల కల్యాణ మహోత్సవం మాహబుబాబాద్ జిల్లా కేంద్రం లోని నర్సంపేట రోడ్డులోగల గాయత్రీ దేవాలయంలో సోమవారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ హాజరై స్వామివారు, అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పోతురాజు రాజు, సంపంగి రామచంద్రు, చెన్నూరి విజయలక్ష్మి, గాడిపల్లి చరణ్, కొవ్వాకుల వినయ్, సురుగు ఐలయ్య, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోరాటాల్లో ముందుండాలి



తొర్రూరు రూరల్: విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కారం కావాలంటే విద్యార్థులు పోరాటాల్లో ముందుండాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ అన్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో భారత విద్యార్థి సమాఖ్య(ఎస్ఎఫ్ఐ) జిల్లా మహాసభలను సంఘం జిల్లా అధ్యక్షుడు పట్ల మధు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మురళీకృష్ణ మాట్లాడారు. విద్యార్థులు ఇష్టంతో చదువుకుంటూ విద్యారంగంలో ఉన్న సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి పోరాటం చేయాలన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ నాయకులు కేలోతు సాయికుమార్, బొల్లం అశోక్, ఎండి యాకుబ్, నాగమల్లు, వీరబాబు, జ్యోతిబసు, సింహాద్రి, జ్యోతి పాల్గొన్నారు.

భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలి

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రం తోపాటు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని కాంగ్రెస్ పార్టీ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం అంజయ్య విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో, అన్యాక్రాంతమైన భూముల రికార్డులు పరిశీలించి, వాటికి హద్దులు నిర్ణయించే విధంగా కలెక్టర్ చర్య తీసుకోవాలని కోరాడు.

'ఉపాధి' బిల్లులు తక్షణమే చెల్లించాలి



మరిపెడ రూరల్: గ్రామీణ ఉపాధి హామీ పనుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కుల వివక్షత వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా ఉపాధ్యక్షుడు జిన్నా లచ్చయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. సోమవారం మండలంలోని అబ్బాయిపాలెం గ్రామంలో కొమ్ముకుంట రాళ్ల సమీపంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించాడు. కార్యక్రమంలో సంధ్య, శోభారాణి, కౌసల్య, సీతారాములు, జినక కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మా ఊరికి బస్సేది..

- ఉప్పెరగూడెం, కొరిపల్లి, చిన్నవంగర గ్రామాల ప్రజలకు తప్పని తిప్పలు
- ప్రైవేట్ వాహనాలే దిక్కు
- మహాలక్ష్మి పథకం కోల్పోతున్న మహిళలు



ఉప్పరగూడెంలో బస్సు సౌకర్యం లేక ఆటో ఎక్కుతున్న మహిళలు

పెద్దవంగర: రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు సౌకర్యం కల్పించింది. కొన్ని గ్రామాలకు బస్సులు రాకపోవడంతో వారంతా మహాలక్ష్మి కింద ఆర్టీసీ సేవలను వినియోగించుకోలేక పోతున్నారు. మహాలక్ష్మి పథకం దేవుడెరుగు.. కనీసం మా గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెద్దవంగర మండలంలో 20 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కేవలం తొర్రూరు నుంచి హైదరాబాద్ జాతీయ రహదారిపై ఉన్న చిన్నవంగర, పెద్దవంగర మండల కేంద్రం, వడ్డెకొత్తపల్లి గ్రామాలకు మాత్రమే ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది. ఈ గ్రామాలతోపాటు అటువైపు గ్రామాలైన అవుతాపురం, పోచంపల్లి, గంట్లకుంట గ్రామాలకు మాత్రం హైదరాబాద్, తొర్రూరు పట్టణాలకు వెళ్లేందుకు బస్సు సౌకర్యం ఉంది. కాని మండల కేంద్రానికి వచ్చేందుకు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పెద్దవంగర మండలం ఏర్పాటు నుంచి నేటికి ఆటోలనే ఆశ్రయిస్తున్నారు.

బీటీ రోడ్లు ఉన్న ఫలితం శూన్యమే..

మండలంలోని గ్రామీణ ప్రాంతాలకు వెళ్లేందుకు బీటీ రోడ్లు సౌకర్యవంతంగా ఉన్నాయి. ఇటీవల రూ. కోట్లు వెచ్చించి ఉప్పరగూడెం ఎక్స్‌రోడ్డు నుంచి పెద్దవంగర మండల కేంద్రం ఎక్స్‌రోడ్డు వరకు డబుల్ బీటీ రోడ్డును నిర్మించారు. అదేవిధంగా పెద్దవంగర నుంచి గంట్లకుంట, పోచంపల్లి, అవుతాపురం వరకు డబుల్ రోడ్లను నిర్మించారు. కొరిపల్లి, చిన్నవంగర, గ్రామాలతోపాటు దాదాపు అన్నితండాలకు బీటీ రోడ్లను విశాలంగా నిర్మించినప్పటికీ ఆర్టీసీ మాత్రం ఒక్క పల్లెవెలుగు సర్వీసు కూడా ప్రారంభించ లేదు.

మహాలక్ష్మి మాకేది..

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాల అమల్లో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని పొందలేకపోతున్నారు. మండలంలో అనేక గ్రామాలు, తండాల్లో బస్సులు నడపకపోవడంతో గ్రామీణ మహిళలు ఈ పథకానికి దూరమవుతున్నారు. ఆటోలు, ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పల్లెలకు బస్సులు నడిపించాలని వారు కోరుతున్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



మా గ్రామానికి ఆర్టీసీ బస్సులు రావడం లేదు. గతంలో బస్సులు వచ్చేవి. అప్పుడు ఇబ్బందులు లేకుండా సౌకర్యవంతగా ఉండేది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం వినియోగించుకోలేకపోతున్నాం. పెద్దవంగర మండల కేంద్రానికి, తొర్రూరుకు వెళ్లాలంటే ఆటోలే దిక్కు. బస్సు సౌకర్యం కల్పించాలి.

\- బైన వేదశ్రీ, ఉప్పరగూడెం

విద్యుత్ చౌర్యాన్ని అరికట్టాలి



నెహ్రూసెంటర్: మాట్లాడుతున్న డీఈ విజయ్‌కుమార్

నెహ్రూసెంటర్/గూడూరు/కురవి: విద్యుత్ చౌర్యాన్ని అరికట్టేలా చర్య తీసుకోవాలని విద్యుత్‌శాఖ డివిజనల్ ఇంజనీర్ (డీఈ) పి.విజయ్‌కుమార్ సూచించారు. మహబూబాబాద్ సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ ఉద్యోగులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగదారులకు అంతరాలు లేని విద్యుత్‌ను సరఫరా చేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న గృహజ్యోతి పథకాన్ని అందరికీ చేరేలా చూడాలన్నారు. విద్యుత్ వినియోగదారుల పట్ల సౌమ్యంగా వ్యవహరించాలని, ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ ఏడీఈ శ్రీనివాస్, ఏఏఈ రమేష్, ఏఈలు సంగీత, నవ్యశ్రీ, బోజ్యానాయక్, సబ్ ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలుగా నిలవాలి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీఐ

తొర్రూరు: ప్రతి వ్యక్తి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని తొర్రూరు సీఐ సంజీవ కోరారు. సోమవారం డివిజన్ కేంద్రంలో మేమున్నాం స్వచ్ఛంద సంస్థ వారి ఆధ్వర్యంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ వారి సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఐ మాట్లాడుతూ, ప్రజాసేవ కార్యక్రమాలు స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో సమాజంలో సరైన గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పత్తి వెంకన్న, ఎంపీపీ తూర్పాటి అంజయ్య, జెడ్పీటీసీ మంగళపెల్లి శ్రీనివాస్, ఎస్సై జగదీష్, వైద్యుడు రాజేందర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

రైతులపై దాడులను ఖండించండి



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

నెహ్రూసెంటర్: దేశ రాజధాని ఢిల్లీలో నిరసన తెలుపుతున్న రైతులపై మోదీ ప్రభుత్వం చేస్తున్న పాశవిక దాడులను ఖండించాలని, రైతుల పక్షాన సీపీఐ పోరాటాలు నిర్వహిస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథిరెడ్డి అన్నారు. ఢిల్లీలో రైతులు చేపడుతున్న ఉద్యమానికి బాసటగా, రైతులపై దాడులను నిరసిస్తూ జిల్లా కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ సోమవారం నిర్వహించారు. పట్టణంలో ర్యాలీగా బయల్దేరిన సీపీఐ శ్రేణులను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు తమ్మెర విశ్వేశ్వర్‌రావు, బి.అజయ్‌సారథి రెడ్డి, నల్లు సుధాకర్‌రెడ్డి, కట్టెబోయిన శ్రీనివాస్, నాయకులు పెరుగు కుమార్, కట్లోజు పాండురంగాచారి, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, వరిపెల్లి వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పి కొట్టాలి

కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న, ఎస్కేఎం నాయకుడు నల్లు సుధాకర్ డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) జాతీయ కమిటీ పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ సెంటర్‌లో రహదారుల దిగ్బంధన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయరంగాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్న మోదీ ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ఎస్కేఎం నాయకులు గుజ్జు దేవేందర్, గునిగంటి రాజన్న, నందగిరి వెంకటేశ్వర్లు, తాజ్‌పాషా, బాబు, లింగ్యా పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి

గార్ల: గార్ల సీహెచ్‌సీలో ఔట్‌సోర్సింగ్ వర్కర్ల 6నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం గార్ల సీహెచ్‌సీ సూపరింటెండెంట్ సీహెచ్ రమేష్‌కు ఔట్‌సోర్సింగ్ వర్కర్లు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వర్కర్లు దేవరాజ్, నరేష్, రమేష్, గోరిబాయి, విజయలక్ష్మి, వీరేందర్, వినోద్, సింధు, ఎల్లయ్య, కళ, ఉమ, జాన్‌బీ, తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

చిన్నగూడూరు: మండలంలోని తుమ్మలచెరువు తండాలో గుడుంబా స్థావరాలపై స్థానిక పోలీసులు ఆదివారం రాత్రి దాడులు నిర్వహించారు. ఎస్సై ఝాన్సీ తెలిపిన వివరాల ప్రకారం.. తుమ్మలచెరువుతండాలో పెట్రోలింగ్ చేస్తుండగా నమ్మదగిన సమాచారం మేరకు తండాకు చెందిన ధరావత్ తారమ్మ ఇంటి వద్ద 100లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి, 5లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆమెకు బెల్లం సరఫరా చేసిన మరిపెడ మండలం వీరారం శ్రీను ఇంట్లో తనిఖీ చేయగా 50కిలోల నల్లబెల్లం, కిలో పట్టిక స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. దాడుల్లో పోలీసులు కిషన్, మోహన్ పాల్గొన్నారు.

ఇరిగేషన్ డీఈఈపై చర్య తీసుకోవాలి



ఆందోళన చేస్తున్న ముస్లింలు

మహబూబాబాద్: షాదీఖానా నిర్మాణం చేసే స్థలం ఎన్ఓసీ విషయంలో రూ.5లక్షలు డిమాండ్ చేస్తున్న ఇరిగేషన్ శాఖ డీఈఈ కిశోర్‌కుమార్‌పై చర్య తీసుకోవాలని ముస్లిం జేఏసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అహ్మద్‌ఖాన్ డిమాండ్ చేశాడు. సోమవారం కమిటీ ఆధ్వర్యంలో ఇరిగేషన్ డీఈఈ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈసందర్భంగా అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ.. పేద ముస్లిం అమ్మాయిల వివాహాలకు ఉచితంగా నిర్మాణం చేసేందుకు షాదీఖానా స్థలం విషయంలో డీఈఈ రూ.5లక్షలు డిమాండ్ చేశాడని ఆరోపించాడు. నిజాం చెరువులో నక్లెస్ రోడ్డు తొలగింపు పేరిట పట్టా భూమిలో దాదాపు రూ.15లక్షల మట్టిని డీఈఈ అమ్ముకున్నాడన్నారు. డీఈఈపై పూర్తిస్థాయిలో విచారణ చేసి న్యాయం చేయాలన్నారు. జహీరుద్దీన్, అలీం, జీయా పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

తొర్రూరు రూరల్: డివిజన్ కేంద్రంలో త్వరలో జరగనున్న మహా శివరాత్రి వేడుకలను జయప్రదం చేయాలని త్రైత సిద్ధాంత-ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు సుధాకర్ కోరారు. సోమవారం మండలంలోని దుబ్బతండాలో సేవా సమితి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు గణేష్, సంపత్, మధు, అశోక్, యాకయ్య, రాజు, సైదులు పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే ప్రమోషన్లు ఇవ్వాలి



ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ హెల్పర్స్

మహబూబాబాద్: అంగన్‌వాడీ హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని, ప్రధానంగా పాత పద్ధతిలోనే ప్రమోషన్ ఇవ్వాలని, ప్రమోషన్ వయసు 50కి పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రాజు, కుంట ఉపేందర్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి స్నేహ బిందు డిమాండ్ చేశారు. సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కార్యకర్తల ప్రమోషన్‌లో విద్యార్హత పదో తరగతి నుంచి ఇంటర్ చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమోషన్‌లో సీనియార్టీని పరిగణలోకి తీసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మంగమ్మ, మౌనిక, యమునా సుజాత, జ్యోతి పాల్గొన్నారు.

అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం



కేసముద్రం: సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాగేశ్వర్‌రావు

కేసముద్రం: గ్రామాలు, తండాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించాడు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు బండారు దయాకర్, ఎంపీటీసీ కందాల కృష్ణమూర్తి, గ్రామపార్టీ అధ్యక్షుడు నూకల వెంకటేశ్వర్లు, తండా వెంకన్న, పరిపూర్ణాచారి, రమేష్, పాపయ్య, ఉప్పలయ్య, రాజు, వెంకన్న, శ్రీను, సుధాకర్, రవి, తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

కురవి: మండలంలోని నేరడ శివారు చీమ్లాతండా జీపీ పరిధిలోని భంగ్యా తండాలో ఎంపీ మాలోత్ కవిత సహకారంతో రూ.5లక్షల సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ గుగులోత్ పద్మావతి రవినాయక్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కురవి సొసైటీ చైర్మన్ దొడ్డ గోవర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు భూక్య మంగీలాల్, భూక్య హచ్యా నాయక్, మాజీ ఉప సర్పంచ్ ధరావత్ వెంకన్న, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

భూన్యాయ శిబిరం వాయిదా

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ జిల్లాలోని చిన్నవంగర గ్రామంలో ఈనెల 28వ తేదీ బుధవారం నిర్వహించాల్సిన భూన్యాయ శిబిరాన్ని వాయిదా వేసినట్లు లీఫ్స్ సలహాదారు కరుణాకర్ దేశాయ్ సోమవారం తెలిపాడు.

పోలియో రహిత సమాజమే ధ్యేయం

దంతాలపల్లి: పోలియో రహిత సమాజమే ధ్యేయంగా చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలు వేయించాలని తహసీల్దార్ తెల్ల శ్రీనువాస్‌రావు, నర్సింహులపేట తహసీల్దారు డి.శ్రీనువాస్‌రావు అన్నారు. మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం నిర్వహించిన పల్స్‌పోలియో ట్రెనింగ్ ప్రోగ్రాంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యాధికారి చైతన్య, ఎంపీడీఓలు విజయలక్ష్మి, నాగరాజు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

కేసముద్రం: మండలంలోని కాట్రపల్లి శివాలయంలో రావుల విజయపాల్‌రెడ్డి సహకారంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను సోమవారం ప్రారంభించాడు. సీసీ పనులకు రూ.75వేలను ఆయన విరాళంగా అందజేశాడు.

పరీక్ష కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలి

గార్ల: ఈనెల 28 నుంచి జరుగనున్న ఇంటర్ పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని పీడీఎస్‌యూ మండల కార్యదర్శి ఎం.మహేష్‌కుమార్ డిమాండ్ చేశాడు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. పరీక్ష సమయంలో ఆర్టీసీ బస్సులు నడపాలని, ఒక్క నిమిషం ఆలస్యం నిబంధన ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

ఉపాధి పనులపై ప్రజావేదిక

దోర్నకల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై సోమవారం ప్రజావేదిక నిర్వహించారు. మండలంలో 2022 ఏప్రిల్ ఒకటి నుంచి 2023 మార్చి 31 వరకు జరిగిన ఉపాధి పనులపై ప్రజావేదికలో సమీక్ష జరిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ శాంతకుమారి, ఏఎస్ఓ ఆయూబ్, అధికారి ఆదం, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏపీఓ పార్థసారథి పాల్గొన్నారు.

ఉన్నత ఫలితాలు సాధించాలి

నర్సింహులపేట: విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత ఫలితాలు సాధించాలని ఎస్సై గండ్రాతి సతీష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 10వ తరగతి విద్యార్థుల వీడ్కోల్ సమావేశంలో ఎస్సై ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆనంద్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రెస్ అకాడమీ చైర్మన్ నియామకంపై హర్షం

మహబూబాబాద్: తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి నియామకంపై టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు మట్టూరి నాగేశ్వర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశాడు. శ్రీనివాస్‌రెడ్డిని నియమించడంపై సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపాడు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

దంతాలపల్లి: మండలకేంద్రంలో ఆదివారం అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై కరాణాకర్ తెలిపాడు. నెల్లికుదురు మండలం బ్రాహ్మణకొత్తపల్లి సమీపంలోని ఆకేరు వాగులో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు పేర్కొన్నాడు.

రేపు గార్లకు విజయ సంకల్ప యాత్ర

గార్ల: బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన విజయ సంకల్ప యాత్ర ఈనెల 28న గార్లకు చేరుకోనున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు జశ్వంత్ ఠాకూర్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడారు. సంకల్ప యాత్రలో మండలంలోని పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు సత్యనారాయణ, నాగరాజు, రాము, శ్రీను, బుచ్చిబాబు, దేవ, గణేష్ పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

బయ్యారం/గార్ల: ఇల్లెందులో నేడు నిర్వహించనున్న సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాల ముగింపు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సేవాలాల్ సేన రాష్ట్ర నాయకుడు భూక్య రవినాయక్, గార్ల ఎంపీపీ భట్టు నాగరాజు సోమవారం పిలుపునిచ్చారు.

ఇళ్ల నిర్మాణాలు జరిగేలా చూడాలి

కేసముద్రం: మండలంలోని భుక్యారాంతండా జీపీ శివారు కాలనీతండాలో గత ప్రభుత్వం ఇళ్లపట్టాలను అందించి స్థలాలను కేటాయించిందని, అట్టి స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు జరిగేలా చూడాలంటూ తండాకు చెందిన వెంకన్నతోపాటు పలువురు తండావాసులు కోరారు. సోమవారం ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

నామినేటెడ్ పదవి ఇవ్వాలని వినతి

కేసముద్రం: 30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు కష్టపడుతూ వచ్చిన తనకు కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవి, లేదా గిరిజన శాఖలో ఏదైనా నామినేటెడ్ పదవి ఇవ్వాలంటూ పీసీసీ సభ్యుడు గుగులోతు దస్రూనాయక్ తెలిపాడు. సోమవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో, పార్టీ ఆఫీస్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ దీపదాస్ మున్షి, ప్రభుత్వ సలహదారు వేం నరేందర్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలను కలిసి వినతిపత్రం అందజేసినట్లు పేర్కొన్నాడు.


'రోడ్డు పనుల్లో నాణ్యత లేదు'

కేసముద్రం: కేసముద్రంవిలేజ్‌లోని ఎన్టీఆర్ విగ్రహం నుంచి కల్వల గ్రామం వైపు గల తారురోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని జి.దామోదర్, కృష్ణమూర్తి, సత్యనారాయణ, అనిల్, ప్రభాకర్ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

డ్రాయింగ్, వ్యాసరచనలో విద్యార్థుల ప్రతిభ

దోర్నకల్: ఇటీవల డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో నిర్వహించిన అమృత్ భారత్ స్టేషన్ స్కీం డ్రాయింగ్ పోటీల్లో నిర్మల స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. డ్రాయింగ్ పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు సయ్యమ్ జైన్, సాత్విక్, మోక్షజ్ఞ బహుమతులు గెలుచుకున్నారు. వ్యాస రచన పోటీల్లో ఇంద్రనీల్, రేణు, జయశ్రీ గెలుచుకున్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



నెల్లికుదురు: మండలంలోని శ్రీరామగిరి గ్రామంలో సవార్ లచ్చమ్మ పండుగకు సోమవారం ఎమ్మెల్యే మురళీనాయక్ హాజరై స్థానిక నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు గొల్లపల్లి ప్రభాకర్ గౌడ్, ఎద్దళ్ల యాదవరెడ్డి, నాయిని సత్యపాల్‌రెడ్డి, కాసం లక్ష్మారెడ్డి, వైస్ ఎంపీపీ జెల్ల వెంకటేష్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

టీస్టాల్‌పై యువకుల దాడి.. ముగ్గురికి గాయాలు

కురవి: మండల కేంద్రంలోని గుడి సెంటర్ వద్ద టీస్టాల్ నడుపుతున్న ముగ్గురు వ్యక్తులపై ఆదివారం రాత్రి కొందరు యువకులు మద్యం మత్తులో దాడి చేసి కొట్టారు. బాధితులు భైరుసింగ్, నర్పంత్‌సింగ్, సబైసింగ్‌ల కథనం ప్రకారం.. వేరే రాష్ట్రం నుంచి వచ్చి కురవి గుడిసెంటర్ వద్ద టీస్టాల్ పెట్టుకుని జీవిస్తున్నామన్నారు. కురవికి చెందిన కొందరు యువకులు మద్యం మత్తులో వచ్చి టీస్టాల్‌పై పడి ధ్వంసం చేయడంతోపాటు తమపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చినట్లు వారు తెలిపారు. గతంలో మూడుసార్లు టీస్టాల్ వద్ద అదే వ్యక్తులు దాడి చేశారన్నారు. వారితో తమకు ప్రాణహాణి ఉందని వివరించారు. ఈ విషయమై కురవి ఎస్సై గోపిని వివరణ కోరగా గొడవ విషయమై టీస్టాల్ నడుపుతున్న వ్యక్తులు సోమవారం ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నాడు.

రైలునుంచి జారిపడి ఒకరికి తీవ్రగాయాలు

మహబూబాబాద్ రూరల్: రైలు నుంచి జారిపడి ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన మహబూబాబాద్ రైల్వేస్టేషన్ పరిధిలోని సిగ్నల్ కాలనీ డంపింగ్ యార్డు సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రవీందర్, ఆర్పీఎఫ్ పీసీ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రంలోని భాగల్‌పూర్ జిల్లా ప్రమోద్ మండలం ఆరాజీ కసకైటీ సెమారియా ప్రాంతానికి చెందిన శైలుకుమార్ గుర్తు తెలియని రైలులో ప్రయాణిస్తున్నాడు. ఈక్రమంలో రైలు మహబూబాబాద్ రైల్వేస్టేషన్ మీదుగా వెళ్తుండగా పట్టణ పరిధిలోని సిగ్నల్ కాలనీ డంపింగ్ యార్డు సమీపంలో శైలుకుమార్ రైలు నుంచి జారి కిందపడిపోయాడు. విషయాన్ని రైల్వే అధికారులు జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బందికి తెలియజేశారు. గాయపడిన యువకుడిని 108 ద్వారా ఈఎంటీ బంగారీ, పైలట్ రాము చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి..

కొత్తగూడ: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని కిష్టాపురం క్రాస్ రోడ్డు సమీపంలో సోమవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గంగారం మండలం మహదేవునిగూడెం గ్రామానికి చెందిన సారంగపాణి ద్విచక్ర వాహనంపై కొత్తగూడకు వస్తుండగా కిష్టాపురం క్రాస్ రోడ్డు సమీపంలో ఎదురుగా వచ్చే వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో అదుపుతప్పి చెట్టును ఢీకొన్నాడు. దీంతో సారంగపాణికి తీవ్ర గాయాలు కాగా అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు 108కు సమాచారం అందించి నర్సంపేట ఆస్పత్రికి తరలించారు.

కుక్కర్ పేలి గాయాలు

చిన్నగుడూరు: మండల కేంద్రంలోని కస్తుర్బా గాంధీ బాలికల పాఠశాలలో కుక్కర్ పేలి వర్కర్‌కు గాయాలైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. పాఠశాలలో పిల్లలకు వంట చేసే సమయంలో కుక్కర్‌లో కూర ఉడికిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కుక్కర్ పేలి వర్కర్ స్వప్న ముఖం, శరీరానికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్వప్నను ఉపాధ్యాయులు మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కుక్కల దాడిలో 17గొర్రెలు మృతి



దంతాలపల్లి: మండలంలోని బొడ్లాడ గ్రామంలో ఆదివారం రాత్రి వీధి కుక్కల దాడిలో 17గొర్రెలు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. బాధితుడు గౌరు వీరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి వీరయ్య గొర్రెల వద్ద కాపలాగా పడుకున్నాడు. కొద్ది సేపటికి దోమలు కుడుతున్నాయని ఇంట్లోకి వెళ్లాడు. పది నిమిషాల తర్వాత గొర్రెల అరుపులు వినపడడంతో బయటికి వచ్చి చూసే సరికి అప్పటికే కుక్కలు గొర్రెలపై దాడి చేశాయి. 17గొర్రెలు చనిపోయాయని వీరయ్య ఆవేదన వ్యక్తం చేశాడు.

మహాసభలను జయప్రదం చేయండి

నెహ్రూసెంటర్: నేడు యాదగిరిగుట్టలో జరగనున్న పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర 55వ మహాసభలను జయప్రదం చేయాలని ప్రజావైద్య, ఆరోగ్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఒబిలిశెట్టి రామకృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో సోమవారం మహాసభల పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వసంతరాణి, సువర్ణ, విజయ, సృజన, రత్నకుమారి పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

చిన్నగూడూరు: మండల కేంద్రంలో జయ్యారం క్రాస్‌రోడ్డు వద్ద సోమవారం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా వేముల ధనుంజయ్ అనే వ్యక్తి మేఘ్య తండా నుంచి ఆటోలో తరలిస్తున్న 150కిలోల పీడీఎస్ బియ్యం పట్టుకొని అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఝాన్సీ తెలిపారు.